

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆం(ధదేశమంతటా ఉన్న చిన్న చిన్న (గ్రామాలే అ(గహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉ(గంగానూ (ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అ(గహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సం(ప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అ(గహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే (ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పా(తలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అ(గహారపు కథలు. - *రచయిత(బెంగుళూరు)*

# లెక్కల్లో మనిషి

చామనచాయలో, సన్నగా పీలగా గట్టిగా మాట్లాడితే ఐదడుగులకి మించని ఎత్తులో ఉంటుంది కోమట్ల భాగ్యలక్ష్మి. చిన్నప్పటినించీ అందరూ భాగ్యం అనే అంటారు ఆవిడని. ఆ మాటకొస్తే ఆమె సంగతి బాగా తెలిసిన వాళ్ళు 'లెక్కల భాగ్యం' అంటారు భాగ్యం వాళ్ళు అ(గహారం మధ్యలో మూలవారి పాత ఇంట్లో అద్దెకి ఉంటారు. .

భాగ్యం భర్త సరయ్య రోజూ పొద్దున్నే నోట్ పుస్తకాలూ, పాళీలూ, పెన్నులూ, ఇంకూ ఇలాంటివి పిల్లల సామానులు సంచీలో పెట్టుకుని సైకిల్ వేసుకుని బయలుదేరతాడు. చుట్టుపక్కల ఊర్లన్నీ తిరిగి స్కూళ్ళల్లో పిల్లలకి కావలసినవి అమ్మి సాయం(తం తిరిగి వస్తాడు. భాగ్యం ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేది. మాట్లాడటం మొదలుపెడితే ఆపడం ఆవిడ కం(టోల్లో ఉండదు. అలా అని అక్కరలేని మాటలేవీ ఉండవు మంచివే..

కొత్త సినిమాలు చూసి వచ్చి అందరికీ కథలు చెప్పేది రేవుకెళ్ళి నీళ్ళు తెచ్చుకునేటప్పుడూ అదీ.. ఎవ్వరికే పని సహాయం కావలసినా వెనకాడకుండా చేసి పెట్టేది.

పెద్ద అమ్మాయికి పెళ్ళి అయింది. తర్వాత ముగ్గురు కొడుకులు.. చివర మళ్ళీ కూతురు. ఆ పిల్ల చదవనంటే చదవని మొండికేసి రెండో క్లాస్‌లోనే మానేసింది. రోజంతా అక్కడా, ఇక్కడా తిరగడం. ఆటలాడుకోవడం.. ఇదే పని. మగపిల్లలు ముగ్గురూ స్కూల్లో చదువుకుంటారు.

భాగ్యానికీ, లెక్కలకీ చిన్ననాటినించీ అవినాభావ సంబంధం. అలా అని ఆవిడేదో పెద్ద లెక్కల ప్రొఫెసర్ అనుకునేరు. అదెలా ఉంటుందో చూస్తే మనకే తెలుస్తుంది.

" అమ్మా! మన మందారచెట్టు కుడివైపున నాలుగో ఆకు చాటున మొగ్గేసిందే " అందిట చిన్నప్పుడు ఒకసారి భాగ్యం..

" అదేం లెక్క? మందారచెట్టు మొగ్గ తొడిగింది అని చెప్పచ్చు కదా".. వాళ్ళమ్మ అంటే..

" మొగ్గ వేసింది అనడానికీ, దీనికీ తేడా లేదూ? ఊరికే మొగ్గేసింది అంటే ఇక్కడ వంటగదిలో ఉన్న నీకెలా తెలుస్తది? " అందిట.

అయిపోయిన పౌడర్ డబ్బా వెనకవైపున రూపాయి కాసు పట్టేంత చిన్న చిల్లు చేసి దానిలో చిల్లర డబ్బులు దాచుకునేదిట. అలవాటు ఇన్నేళ్ళయినా మానలేదు. 'చిల్లర శ్రీమహాలక్ష్మి" అనేది.

అప్పటినించీ మొదలు.. ఇప్పటివరకూ భాగ్యం మాట్లాడే ప్రతీ వాక్యం లోనూ ఎదో ఒక లెక్క ఉండి తీరవలసినదే

" పన్నెండు మెట్లలో నాలుగోది కడుగుతున్నానా? పక్కన ఉన్న పొదలోంచి పాము పాకినట్టు అయింది " అంటుంది. లేదా.. "నాలుగు చేదల నీళ్ళు తోడితే మన అరటి మొక్కలు అన్నీ తడుస్తాయి.. ఐదోది అక్కర్లేదు" అంటుంది.

తమ ఐదుగురికీ, అత్తగారికీ సరిపడాలంటే రెండు పావుల కూరలుండాలిట. ఒక్కటి ఎక్కువా, తక్కువా కాకుండా వండుతుంది. వంకాయలైతే మనిషికి రెండు చొప్పున పన్నెండూ, అరటికాయలైతే ఇద్దరికొక్కటి చొప్పున మూడు.. ఇలా.. ఇంక వడియాలూ, అప్పడాలూ అయితే చెప్పనే అక్కరలేదు.

అన్నానికొక గిన్నె, పప్పుకొక గిన్నె, కూరకొకటి, చారుకొకటి, వాటి మీద మూతలూ కలిపి రోజుకి ఎనిమిదే గిన్నెలు పడాలి. తినడానికి ఆకులు.. మంచినీళ్ళకి అందరికీ చిన్న చిన్న మట్టికూజాలు.. పెరుగు కూడా మట్టిముంతలోనే తోడు వేస్తుంది. అవి అయితే కడుక్కోవడం తేలికట.

"ఈ సారి మావిడికాయ పులుపే లేదు పిన్నిగారు, కిందటిసారి రెండు కాయలేస్తే చాలిందా, పప్పులోకి.. ఈ సారి సరిపోలేదు. " అంది..

"అదేవిటి భాగ్యం? పులుపు చూసుకుని వేసుకోరూ? ఇదేం లెక్క? "అంటే..

"మంచోరే, ఒక్క పప్పుకే మూడు కాయలేసేస్తే రేపు పచ్చడికెలాగంటారు? పులుపు కూసింత తగ్గితే ఆవకాయ ఏసుకోచ్చుకదా, ఏవంటారు? " అంది..

" ఏమోనమ్మా, నీలెక్కలు నీకే తెలియాలి" అందావిడ నవ్వుతూ.. .

భాగ్యానికి మిషన్ కుట్టడం వచ్చు.. అందరికీ కొత్త బట్టలు కుట్టడమే కాదు, పాతవీ, పడేద్దామనుకున్నవీ కూడా తీసుకుని చక్కటి బట్టలు కుట్టేవి. జాకట్టుకి ఐదు బొత్తాలు పెట్టాలంటే ఐదే. ఒకటి ఎక్కువా, ఒకటీ తక్కువ కాకుండా.

ఎదురింటి వారి అమ్మాయి పాత పట్టుపరికిణీ పొట్టయిపోయింది, స్టీల్ సామానుల వాడికి వేసేద్దాం అనుకున్నప్పుడు..

" ఎందుకండీ? నిచ్చేపంలాంటి పరికిణీ.. నాకియ్యండి.. మీ చిన్నమ్మాయికి గౌన్ కుట్టుకొస్తాను " అని చక్కగా కత్తిరించి మెడకీ, చేతులకీ, గౌను చుట్టూనూ అంచు వచ్చేలా అందంగా వేసి గౌన్ కుట్టుకొచ్చింది..

" అబ్బో ఎంత బావుందో? "అని మురిసిపోయిందా చిన్నపిల్ల. వేసుకున్న గౌను మూడు రోజులు విప్పలేదు.. వాళ్ళమ్మ తిట్టినా సరే.

అలాగే పాత చీరలు బొంతలమీద కవర్ల లా కుట్టి పాత బొంతలని కొత్తవాటిలా చేసేది. చీర మధ్యలో చిరుగు పడితే దానిని రెండు సగాలుగా చింపి అంచులు కుట్టి ఆడపిల్లలని ఓణీల్లా వేసుకోమనేది.. ఇలా ఎన్నో..

"బుర్రలో లెక్కలుండాలి కానండి.. పనికిరానిదేదీ లేదండి ఈ పెపంచకంలో " అనేది నవ్వుతూ.. కొబ్బరాకులతో అల్లిన రెండు తడకల మధ్యనా చేంతాడుతో కట్టి దాన్ని గది మధ్యలో నిలబెట్టి ఒక పక్క కిటికీకీ, రెండో పక్క మేకుకీ తాడు కట్టి నిలబెట్టి గదిని రెండు భాగాలుగా చేసింది

"పెద్దాడు కూసింత ఎక్కువ సేపు సదూకుంటూంటే మా అత్తమ్మకి నిదరట్టడంలేదంటండీ.. అందుకే ఉన్న రెండు గదులనీ మూడు సేత్తాన్నాను" అంది.. అదేనవ్వు.

ఫలానా టైముకి తెస్తానంటే అటు సూర్యుడు ఇటు పొడిచినా సరే.. చేసేసేది.. అలాగే తనకి పైసా రావలసినా సరే.. బెత్తాయించి మరీ పుచ్చుకునేది.

ఇవన్నీ ఒక ఎత్తైతే ప్రతీ ఒక్కరినీ నవ్వుల్లో ముంచెత్తేవి మరొక ఎత్తు.

వసారాలో వేసుకున మట్టిపొయ్యిమీదే వండేది వంట. ఎప్పుడో అల్లుడొచ్చినప్పుడో, పెద్దపండగకో(సంక్రాంతి) తప్ప స్టౌవ్ తీసేది కాదు. నెలకోసారి తీసి తుడిచి మళ్ళీ మెత్తటి గుడ్డ కప్పి అటకమీద దాచేసేది.

పొయ్యిలోకి డొక్కలూ, కమ్మలూ వీధి చివర ఉన్న వారింట్లో కొనుక్కునేది. గంప అర్ధరూపాయి చొప్పున.. అవి ఇంటికి తెచ్చుకున్నాకా, దగ్గరుండి లెక్క చూసుకుని మొదటిసారి వచ్చిన వాటితో సరి చూసుకునేది.. రెండు తక్కువైతే అడిగి తెచ్చేసుకునేది.. అలాగే పొరపాటున రెండో, మూడో ఎక్కువైతే వెంటనే వెళ్ళి ఇచ్చేసేది.. వాళ్ళు నవ్వినా సరే, పరవాలేదన్నా సరే.. అప్పుడప్పుడు భాగ్యానికి కొంచం పిచ్చేమో అనుకునేవారు కూడా కొందరు.

అలాంటిదే మరొకటి.

భాగ్యమ్మ ఆవకాయ పెట్టేడప్పుడు చూడాలి. పిల్లలకిష్టమని వెల్లుల్లిపాయలు వేసిన ఆవకాయే పెట్టేది ఎప్పుడూ. దానికోసం రెండు కేజీలు వెల్లుల్లిపాయలు తెప్పించి, వాటికి నూనెరాసి రెండు రోజులు ఎండలో పెట్టి, వొలిచేది తర్వాత కొత్త ట్వైన్ దారం తెచ్చి జాగ్రత్తగా మల్లెపూలు గుచ్చినంత సున్నితంగా ఆ దారానికి ఒలిచిన పాయలు పద్దెనిమిదేసి చొప్పున గుచ్చి ముళ్ళు వేసేది. ఆవకాయ పాళ్ళన్నీ సమానంగా కలిపాకా నూనె పోసేముందు ఈ దండలన్నింటినీ వాటిలో వేసి అప్పుడు నూనే పోసి కలిపేది. అదేమిటంటే?..

" ఎంత జాగ్రత్తగా చూసి ఏసినా సరే నీకు ఎక్కువొచ్చాయి, నాకు రాలేదు అని కొట్టుకు సచ్చిపోతన్నారీ పిల్లలు. అందుకే.. -ఆవకాయ సీసా తీసి అందరికీ ఊరగాయ వేసినతర్వాత ఒక దండ విప్పి అందరికీ లెక్కెట్టి సమానంగా తలకో మూడూ ఏస్తాను.. అలాగైతే గొడవల్లేవు. " అనేది.. ఔరా..! అని అందరూ ఆశ్చర్యపోయేవారు. ఎంత ఓపికో, అలా పెట్టడానికీ, పంచడానికీ అనుకునేవారు.

ఇన్నేసి లెక్కలేమిటి భాగ్యం? ఊరిలో అందరూ నవ్వుతున్నారు, తెలుసా! అంటే.. అదేమ్మాటండే? ఏదో ఇలాగ పని చేసుకుంటే సులువుగా తెమిలినట్టనిపిస్తదండీ నాకు. అయినా లెక్కల్లేనిదెక్కడండీ మన బతుకుల్లో? మనం వచ్చేది, పోయేదీ కూడా భగవంతుడేసేటి లెక్కేనటండే. ఈ నడిమద్దెన నేనేసే లెక్కలేపాటీయండీ? అయినా ఇందులో నవ్వడానికేటుందండీ? జాగ్రత్తగా ఉంటన్నానంతే.. లేకపోతే ఈ పిల్లలనందరినీ పెంచొద్దా? అనేది.

అమాయకంగా చెప్పినా సరే ఆమె మాటల్లో నిజానికీ, ఆమె మంచితనానికీ ముచ్చటపడేవారు. ఎవ్వరినీ ఎప్పుడూ ఒక్క మాట అనేది కాదు.. తన పనేదో, తన లోకమేదో. అందుకే అందరికీ భాగ్యం అంటే చాలా ఇష్టం.

ఆమె అలా అనడానికి కారణముంది.

ఒక సారి పక్క ఊరిలో శివరాత్రికి జాగారం, హరికథాకాలక్షేపం భజనా ఏర్పాటు చేసారు. వాళ్ళ పెద్దనాన్న గారి కూతురు ఊరిలో ఉండడం చేతా, ఈ కార్యక్రమం గురించి పదే పదే చెప్పడం చేతా, భాగ్యం, సరయ్యా వెళ్ళారు. సరయ్య బలంగా ఉంటాడు

పొడుగ్గా. ఊరు దాటేవరకూ నడిచి ఆ తర్వాత అతని సైకిల్ వెనక ఎక్కేది భాగ్యం.. ఊరిలో ఎవరైనా చూస్తే బావుండదని ఆమె భయం.., ఆ ఘ మేఘాలమీద తొక్కేసేవాడు అతను..

ఆ రోజు రాత్రి దాసు గారు చెప్పిన హరికథ భాగ్యానికి చాలా నచ్చింది. ఏదో సందర్భంలో ఆయన అన్నమాటలు ఆమెకి ఎంతో హత్తుకుపోయాయి.

''రుణానుబంధరూపేణా పశుపత్నిసుతాలయా'' అని ఊరికే అన్నారా? ఈ ప్రపంచంలో మన రాకకీ, మనుగడకీ, పోకకీ ఎంతో అర్ధమూ, ప్రయోజనమూ ఉన్నాయి. అవన్నీ మన కర్మ ఫలాన్ని అనుసరించి నిర్ణయించబడతాయి. మనం గత జన్మలలోనూ, ఈ జన్మలోనూ చేసుకున్న పాప పుణ్యాలననుసరించి అవి ప్రభావాన్ని చూపిస్తాయి..

అందుకే అన్ని జన్మలలోకీ ఉత్కృష్టమైన మానవ జన్మ ఎత్తినందుకు మనం చెయ్యవలసినది ఒక్కటే.. వీలైనంతలో తోటివారికి సాయపడటం, ఈ జన్మలోని లెక్కలనీ, రుణాలనీ ఈ జన్మలోనే తీర్చేసుకోవడం.. అలా మనం చెయ్యగలిగితే పునర్జన్మ అనేదే లేకుండా శివ సాయుజ్యం పొందవచ్చు.. అని చక్కని ఉదాహరణలతో చెప్పారు.

'లెక్కలు' అన్న మాట చెవిన పడగానే ఆ మాటలు భాగ్యం మనసులో మరింత గాఢంగా నాటుకుపోయాయి. అసలే లెక్కలమనిషి. ఇది వినేసరికి మరింత బలపడింది. ఆమె నమ్మకం.

ముమ్మిడివరంలో ఉంటుంది భాగ్యం వాళ్ళ అమ్మ చంద్రమ్మ. పెద్ద తోటలో మధ్యన చిన్న ఇల్లు వేసుకుని ఉండేవారు చంద్రమ్మా, ఆమె భర్తా. అతను పోయాకా ఆవిడ ఒక్కర్తే ఉండేది. చాలా రోజులు. పట్నాన ఉన్న కొడుకులు చూసి పోతూ ఉండేవారు.. ఎంత చెప్పినా తన భర్త కడతేరిన చోటే, తానూ అని భీష్మించుకుని కూర్చుంది అ ముసలావిడ.

ఇన్నాళ్ళూ ఓపిగ్గా ఉంది కనక ఇరుగుపొరుగు వారి సాయంతో నెట్టుకొచ్చింది.. ఈ మధ్యన వయసు పైబడి కంటి చూపు మందగించింది. దానితో అన్నింటికీ తడుముకుంటూ ఒకనాడు వంటింటి గుమ్మంలో పడిపోయింది. మోకాలి కింద ఎముక విరిగి కట్టు కట్టారు. 'ఇప్పటికైనా మా దగ్గరకి రావమ్మా!' అంటే 'ససేమిరా' అంది. సెలవలు పెట్టుకుని కొన్నాళ్ళున్నారు కొడుకులు. ఎన్నాళ్ళు సాగుతుంది? ఈ సమస్యకేది దారి అని వాళ్ళు అనుకుంటూ ఉండగా భాగ్యమే చెప్పింది సలహా.

ఒక్కర్తే కూతురు కావడాన భాగ్యానికి వాళ్ళ అమ్మ అంటే ఎంతో ఇష్టం మొదటినించీ. అందుకని తను తన కుటుంబమూ అక్కడకు వెళితే అమ్మని చూసుకున్నట్టూ ఉంటుంది. తాము కొద్దో గొప్పో కూడ బెట్టుకుని కొనుక్కున్న పొలం అక్కడే ఉండటం చేత అది కూడా దగ్గరుండి చూసుకోవచ్చు. అమ్మా, అత్తమ్మా ఒకరికొకరు కాలక్షేపంగా ఉంటారు కూడా. అని భాగ్యం ఆలోచించింది.

తనదెలాగా ఊర్లు తిరిగే వ్యాపారమేకనక సరయ్యకూడా సరే అన్నాడు. పెద్దవాడు కాలేజీలో చేరాడు అక్క దగ్గర కాకినాడలో. చిన్నవాళ్ళిద్దరూ అక్కడే చదువుకోవచ్చు. ఆఖరుదానికి తినడమూ, ఆడుకోవడమూ తప్ప మరే పనీ లేదు కనక పేచీ లేదు. అందుకని అక్కడకు వెళ్ళిపోదామని నిర్ణయించుకున్నారు సరయ్యా, భాగ్యమూ.. భాగ్యం అన్నయ్యలు కూడా ఎంతో సంతోషించారు ఆ మాట విని.

నెలరోజుల ముందే ఊరందరికీ చెప్పేసింది భాగ్యం. ''మా అమ్మగారి ఊరెళ్ళిపోతన్నామండే. '' అంటూ

''అయ్యబాబోయ్ ఇంక బట్టలుచ్చుకోనండి.. మళ్ళీ కుట్టలేకపోతే మా సెడ్డ ఇబ్బందయిపోతాది'' అంది అందరితోనూ.

పెద్దరుగుల సుబ్బారావుగారి భార్య దగ్గరకెళ్ళి

''పిన్నిగారండీ, అప్పుడు మీ దొడ్లోయి పదిహేను పచ్చిమిరగాయలు అప్పుచ్చుకున్నానాండి, తీర్చేడప్పుడు పదేనూ ఇవ్వలేదు గదా,, ఇవిగోండి.. మిగిలిన నాలుగు కాయలూ.. ''అని ఇచ్చేసింది.

ఆవిడ కొంగు అడ్డం పెట్టుకుని ఒకటే నవ్వు.. ''నీదంతా చోద్యం.. భాగ్యమ్మా.. పెరట్లో కాసిన కాయలకి అప్పులూ, లెక్కలూ కూడానా? అయినా ఇంత లెక్కపెట్టేదానివి అప్పుడే ఎందుకు ఇవ్వలేదు? '' అంది.. భాగ్యాన్ని ఏడిపించడానికి నవ్వుతూనే.

"అదేగదండి.. మా చెట్టు అప్పుడు పదమూడే కాసిందండి.. రెండు నేను అట్టేపెట్టుకుని మిగిలిన పదకొండు మీ కోడలిగారికి ఇచ్చానండి.. అందుకే ఇప్పుడు ఇచ్చేస్తన్నా " అని చక్కా వచ్చేసింది.

అలాగే కరణం గారింటికి వెళ్ళి, "మీ బట్టలు కుడతాంటే రెండు సూదులు ఇరిగిపోయాయండి.. మొదటిది పర్లేదులే అనుకున్నానండి. ఇంట్లోంచి తీసి వేసిన రెండోది కూడా పోయేసరికి.. పావలా పెట్టి తెప్పించి ఏసానండి.. అది మీ ఖాతాలోనే.. "అని పావలా అడిగి పుచ్చుకుంది.

" ఈ పావలాకి కూడా లెక్కేనా? తప్పకుండా తీసుకో" అని అంటూనే ఆవిడ కావాలనే అడిగింది.

" సూదితో నా ఒక్కదాని జాకట్టే కుట్టావా? "అని.

" మీది కుడితాంటేనే ఇరిగింది కదండీ.. అంటే తక్కినోరివి కూడా ఆగిపోయేవి కదండీ, ఆ పాపం మీకెందుకండీ?. అందుకని ఇది మీదే " అని నవ్వేసింది..

పైగా.. " ఇట్టాంటి రుణాలుంచుకుంటేనే మళ్ళీ జన్మాలూ.. బాధలూ.. ఈలున్నంతవరకూ తీర్చేసుకున్నామనుకోండి.. ఎదుటోళ్ళకీ సుకం.. మనకీ సుకం.. " అంది.

'భలే మనిషి 'అనుకుందావిడ.

పక్కింటి పంకజం దగ్గరకెళ్ళి.. "వదినా నీ సోల గ్లాస్ నేను నాలుగు సార్లు ఎరువు తెచ్చుకున్నా.. నువ్వు కూడా నా ఇంట్లోంచి ఎదైనా ఓ నాలుగు సార్లు అడిగి తీసుకెల్లి వాడుకో. లెక్క సరిపోద్ది. నేనెల్లేలోపలే సుమా "అని చెప్పి వచ్చింది.

కిరాణా కొట్లో రెండు రూపాయల బాకీ చెల్లేసి వచ్చింది.

"వేసంకాలం తోడు మీరు రోజూ నాకు మల్లెపూలిచ్చేవారు, పిన్నిగారు. ఇదిగోండి.. ఈ చిన్న బొండు మల్లెంటు మీకోసమే కట్టాను. ఇది సూసినప్పుడల్లా నన్ను గుర్తెట్టుకోండి" అంది కన్నీళ్ళతో. "ఇది ఏదో ఒకనాటికి అన్ని పూలూ పూచుద్దండి "అంది.

ఆ మాటలకి ఆవిడకీ కళ్ళ నీళ్ళు గలేదు. " పిచ్చి దానా !ఇదీ లెక్కేనా! తప్పకుండా పూస్తుందిలే, అన్ని పూలూనూ" అని మాత్రం అనగలిగింది. చీర పెడతానంటే ఒప్పుకోలేదు భాగ్యం.

అందరికీ ఇన్ని కబుర్లు చెప్పి నవ్వించి, ఇన్ని పనులు చేసి పెట్టేదానివి కదా,, ఆ లెక్క మాటేవిటి? మేము నీ కెప్పుడు బదులు తీర్చేది? అని దిగులుగా అడిగారు ఆడవారు భాగ్యం వెళ్ళేరోజు..

"అబ్బే అది ఈ నాటిదనుకుంటన్నారా? మీరందరూ నాకెప్పుడో ఏదో సేసి ఉంటారు? లేకపోతే నేను మీకు సాయం సెయ్యడమేటండి.., అయినా ఒకేళ మీరన్నదే నిజమైతే నేనింకా కొన్నాళ్ళు ఇక్కడే ఉండేద్దాన్ని కదండీ. అటు అమ్మ దగ్గరకెళతన్నానన్న - ఆనందమెంతుందో, ఇటు మీ అందర్నీ ఇడిసి ఏలటన్నందుకు బాధ అంతే ఉందండి. అదేనండి లెక్క. రెండుకి రెండేస్తేనే నాలుగవుద్ది.. ఒకటేస్తే కాదండి.. లెక్కంటే లెక్కేనండి.. వస్తానండి.." అని అందరికీ కన్నీళ్ళతో దండాలు పెట్టి మరీ బండి ఎక్కింది..

'లెక్కల భాగ్యం' కాదు 'లెక్కల్లో మనిషి భాగ్యం ' అనుకున్నారు అందరూ బండి కనుమరుగయ్యేదాకా చూస్తూ ..

Click here to share your comments on this article